# టార్గెట్... షాడో

(షాడో ఎడ్వెంచర్)



## మధుబాబు

# TARGET... SHADOW

(Serialised in 'Swathi' Weekly)

By

**MADHU BAABU**

Published by :

**SATYAVANI PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 0866 - 2438659

First Edition :

2022

Price :

Rs. 150-00

Cover Design :

DURGA RAO

Printers :

SRI CHAITANYA OFFSET PRINTERS

Vijayawada - 2

# టార్గెట్... షాడో

**ఒకమాట– కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ కార్చిచ్చు మాదిరి సంచరించి ప్రభుత్వాలనీ, పోలీసుల్నీ పరుగులు పెట్టించిన షాడోని, ఎంతో ప్రయత్నంమీద పట్టుకోగలిగారు సి.బి.ఐ. చీఫ్ కులకర్ణిగారు. ఒప్పించి తమ సంస్థలో చేర్చుకోగలిగారు.**

**ప్రమాదాల్ని ముందుగానే పసికట్టి, అందుకు తగినవిధంగా ప్రవర్తించటం, ఎటువంటి వ్యతిరేకపరిస్థితులు ఎదురైనా కొంచెంగా కూడా బెదరకుండా ఎదురుదెబ్బ తీయటం మొదలైన లక్షణాలు షాడో స్వంతం.**

వాటిని ప్రత్యేకంగా పనికట్టుకుని ఎవరూ నేర్పవలసిన అవసరం లేదు. కాని వదిలిపెట్టలేదు కులకర్ణిగారు. ఎన్నెన్నో ట్రెయినింగ్‌లు ఇప్పించారు.

అత్యంత ఆధునికమైన ఆయుధాలను ఉపయోగించటం ఎలాగో తను దగ్గర వుండి మరీ చెప్పించారు.

ఫలితంగా అమోఘమైన శక్తియుక్తుల్ని సంతరించుకున్నాడు షాడో. సి.బి.ఐ. అమ్ములపొదిలో వున్న దారుణమైన అస్త్రంమాదిరి తయారైనాడు.

కిల్ అండ్ కాంకర్, రేప్ అండ్ రాబరీ మూలసూత్రాలుగా ఉద్భవించి, ప్రపంచ దేశాలన్నిటినీ ఒకే పతాకం కిందకి తీసుకురావాలన్న కోరికతో కార్యక్రమాలు ప్రారంభించిన కిల్లర్స్ గ్యాంగ్‌కి పంటికింది రాయిలా తయారైనాడు షాడో.

అతన్ని అడ్డు తొలగించుకోవటానికి ఎంతగానో ప్రయత్నించింది ఆ గ్యాంగ్. కొమ్ములు తిరిగిన వస్తాదుల్ని పంపించింది. ఉక్కు ముక్కల వంటి హంతకుల్ని నియోగించింది.

ఈగల్ని విదిలించినట్లు విదిలించేశాడు షాడో. తన దృష్టిపథంలోకి వచ్చిన వారి స్థావరాలన్నిటినీ సర్వనాశనం చేసేశాడు.

బలప్రయోగం సరైన ఫలితాలను ఇవ్వకపోవటాన్ని గమనించి తన పంథాను మార్చుకున్నది కిల్లర్స్ గ్యాంగ్. ప్రలోభాల బాటను ఎంచుకున్నది.

మూడుకోట్ల రూపాయల బహుమతిని ప్రకటించింది మొదట షాడో తలను తెచ్చి తమకు సమర్పించినవారికి. సరైన ఫలితం రాలేదు.

మూడుకోట్లు కాస్తా మూడు వందలయినాయి... అతి కొద్దికాలంలోనే ఆ అంకె మూడువేల కోట్లకు చేరుకుంది. తమను ఎదిరించటాన్ని మానుకుని, తమతో చేయి కలిపితే, తాము ప్రపంచాన్ని జయించిన తర్వాత, తాను కోరుకున్న దేశానికి చక్రవర్తిని చేస్తామని కూడా ప్రకటించింది ఆ గ్యాంగ్.

ఆ బెదిరింపులకు, ఆ ఆశలకు లొంగలేదు షాడో. గ్యాంగ్ సభ్యులు ఎక్కడ తారసపడినా రాక్షసుడిమాదిరి వారిని దెబ్బతీయటాన్ని మానుకోలేదు.

విధిలేని పరిస్థితుల్లో తమ సభ్యులందరికీ, షాడోని ఎవాయిడ్ చేయమని సూచనలు పంపించింది గ్యాంగ్. ఎటాక్ చేయటానికి బదులుగా షాడో బలహీనతల్ని గమనించవలసిందిగా ఆర్డర్స్ జారీ చేసింది. దురదృష్టం ఏమిటంటే ఒకటి కాదు... వెయ్యి వున్నాయి షాడోకి బలహీనతలు.

తన కలలరాణి బిందు అతనికి ప్రాణం. తనతోపాటు పని చేస్తున్న స్టార్ ఏజెంట్ ముఖేష్, కొరియర్ ఏజెంట్ శ్రీకర్‌లకు ఏదైనా జరిగితే తట్టుకోవటం చేతకాదు అతనికి.

సి.బి.ఐ. సెక్యూరిటీ కాప్టన్ వాసు, కులకర్ణిగారికి డ్రైవర్‌గా పనిచేసే చంద్ర, సెక్రటరీ సులోచన, రిసెప్షనిస్టు బెట్టీ.... వీరుమాత్రమే కాదు... సి.బి.ఐ.లో వున్న ప్రతి మనిషి అతనికి ఆప్తులే...

అందరికంటే అధికం అతని ఆరోప్రాణం- అస్సాం రౌడీ గంగారాం. షాడోని కార్చిచ్చు అంటే గంగారాంని ఈదురుగాలి అనేవాళ్ళు. దొంగగా జీవితం గడుపుతున్నప్పుడు అతన్ని పట్టుకోవటానికి ప్రయత్నించిన పోలీస్ అధికారులు అందరూ షాడోని పట్టుకోవాలంటే అంతకు ముందుగా గంగారాంని పట్టుకుంటే సరిపోతుందని భావించేవాళ్ళు.

పొట్టిగా లావుగా పిచ్చివాడిలా కనిపించే గంగారాంని పట్టుకోవటంకంటే షాడోని బంధించటం తేలికని తెలిసిరావటంవల్ల, ఏమీ చేయలేక చేతులు ఎత్తేశారు. సి.బి.ఐ.లో చేరబోతున్న సమయంలో గంగారాంని తీసుకుపోయి అస్సాంలో సెటిల్ చేసేశాడు షాడో.

తమ పాత జీవితాన్ని వదిలి కొత్తగా జీవించమని చెప్పి తను వచ్చేశాడు.

అంచెలంచెలుగా ఎదిగిపోయాడు గంగారాం... ఎన్నెన్నో వ్యాపారాలు వ్యాపకాలు... ఒకరు కాదు ఇద్దరు కాదు. దగ్గిర దగ్గిరగా పాతికమంది సెక్రటరీలు... పాతిక దేశాల్లో తన బ్రాంచీలు.

బీహార్ బందిపోటు ఠాకూర్ రాంచంద్, రాజస్థాన్ స్మగ్లర్స్ రామ్‌దయాళ్ సోదరులు, టైగర్ మున్నా, రామభక్త హనుమాన్, స్వాతంత్ర్యం రాకముందు పందెం కట్టి గవర్నర్ జనరల్ భవంతినే కొల్లగొట్టిన కన్నస్వామి... అందరూ అయినవాళ్ళే... అందరూ అతని బలహీనతలే...

ఎవరికి ఏమాత్రం కష్టం వచ్చినా చలించిపోతాడు షాడో... తనను తాను మర్చిపోయి ప్రతీకారం కోసం తహతహలాడిపోతాడు.

మంచి చెడుల విచక్షణ మర్చిపోయిన ఆసమయంలో ఎటాక్ చేయగలిగితే- షాడోని మట్టుబెట్టటం చాలా తేలిక అనే నిశ్చితాభిప్రాయానికి వచ్చి, ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు చేసింది కిల్లర్స్ గ్యాంగ్. అటువంటి ప్రయత్నాల్లో ఒకటి ఈ టార్గెట్... షాడో...

ఆరు అడుగుల ఎత్తుంటాడు చెబ్బీ. దట్టమైన బవిరిగడ్డం. పెద్దపెద్ద మీసాలు. భుజాలమీదికి పరుచుకుంటున్న పొడవాటి జుట్టు... నిగనిగ మెరిసేకళ్ళు...

పొడవాటి బాణాకర్రను పట్టుకుని అతను ఆటోలో నుంచి దిగటాన్ని గమనించి, గబగబా దగ్గిరికిపోయాడు షిన్‌షిరా పట్టణంలో ట్రాఫిక్‌ని కంట్రోల్ చేస్తున్న కానిస్టేబుల్.

'ఎవరు నువ్వు? ఏం పని నీకు ఈ సిటీలో?' కనుబొమ్మల్ని ముడిచి, అందరికీ ఒణుకుపుట్టించే పోలీస్‌చూపు చూస్తూ అడిగాడు. అడిగిన మాటకు సూటిగా సమాధానం చెప్పే అలవాటు చెబ్బీకి ఎప్పుడూ లేదు.

'వట్టి ట్రాఫిక్ కానిస్టేబుల్‌వి. లా అండ్ ఆర్డర్ మనిషివి కాదు. నా ఊసు నీకు దేనికి?' తన లాల్చీ జేబులో నుంచి తిరంగా బీడీ కట్టలో నుంచి ఒక బీడీని తీసి వెలిగించుకుంటూ, చాలా గౌరవంగా చెప్పాడు.

అడిగినదానికి సరైన సమాధానం రాకపోగా, తన ఎదుటే బీడీని వెలిగించు కోవటం నచ్చలేదు కానిస్టేబుల్‌కి.

"పబ్లిక్ ప్లేసులో పొగతాగటం నేరం..." తలను ఇంకాస్త ముందుకు వంచి మరింత కోరగా చూస్తూ చెప్పాడు.

"నాకు తెలుసు. వందో రెండొందలో ఫైను వేస్తారు. రసీదు పుస్తకం వుందా?" కొంచెంగా కూడా బెదరకుండా సమాధానం ఇచ్చాడు చెబ్బీ.

అవధులు దాటిపోయింది కానిస్టేబుల్ ఆగ్రహం. దారి డొంకా సరిగ్గా లేని ఏదో పల్లెటూరి నుంచి వచ్చిన ఒక మొరటుమనిషి తనను చూసి బెదిరిపోకుండా నిలబడటమే కాకుండా, ఎదురు సమాధానాలు చెప్పటమా? షిన్‌షిరా సిటీ పోలీసులంటే ఏమని అనుకుంటున్నాడు?

మహావేగంగా చేయి జాచాడు అతను. చెబ్బీ ధరించివున్న లాల్చీ ముందు భాగాన్ని వడిసి పట్టుకున్నాడు. పట్టుకున్నానని అనుకున్నాడుగాని, జరగలేదు ఆ పని... అతని చేయికంటే వేగంగా వెనక్కి జరిగాడు చెబ్బీ.

చేతిలో వున్న బీడీని పెదవుల మధ్యకు చేర్చుకోవటం, తన లాల్చీని పట్టుకోబోయిన అతని చేతిని మెలిపెట్టి బలంగా వెనక్కినెట్టటం- చిటికె వేసేలోపు జరిగిపోయింది.

"అయ్యబాబోయ్.. విరిగిపోయింది నా చెయ్యి... చచ్చిపోయాను నేను" దారుణమైన బాధతో కళ్ళవెంట నీళ్ళు ప్రత్యక్షం అవుతుండగా, పెద్దగా అరిచాడు కానిస్టేబుల్.

ఎవరి పనులమీదవాళ్ళు బిజీబిజీగా తిరుగుతున్నారు పౌరులు. చటుక్కున ఆగిపోయి ఆ దృశ్యాన్ని చూడటం మొదలుపెట్టారు. చెవులు చిల్లులు పడిపోయేటట్లు హారన్లు మోగిస్తూ పోతున్నాయి వెహికిల్స్... స్పీడ్ బ్రేకర్లు ఎదురైనట్లు సడన్‌బ్రేకులతో ఆగిపోయాయి.

కానిస్టేబుల్ నోటినుంచి అరుపు వెలువడిన ఆరోక్షణంలో ప్రత్యక్షం అయింది పెద్దగుంపు.

"అయ్యో పాపం... ఎవరో అమాయకుడిమాదిరిగా వున్నాడు. మన పోలీసుల గురించి పూర్తిగా తెలిసివుండదు.

స్టేషన్‌కి తీసుకుపోయి మక్కెలు విరగేస్తారు" జాలిగొలిపే కంఠంతో కామెంట్ చేశాడు ఆ గుంపు మధ్యలో వున్న పౌరుడు ఒకతను.

"వెళ్ళిపో భాయీ... దూరంగా వెళ్ళిపో... మా కానిస్టేబుల్స్ మీద చేయి వేయటం మహానేరం..." ధైర్యంచేసి చెబ్బీకి మాత్రమే వినిపించేటట్లు చాలా చిన్నగా హెచ్చరించాడు ఇంకో పౌరుడు.

"నేరమని ఊరికే చెప్పటంలేదు. ఈపాటికి ఎస్సైసాబ్ బయలుదేరే వుంటాడు... నీకు రోజులు మూడిపోయినట్టే...." తను కూడా చెప్పాడు చెబ్బీకి దగ్గరగా వున్న మరో మనిషి.

పెదవుల చివర పెట్టుకున్న బీడీని రెండే రెండు పీల్పుల్లో ఫినిష్ చేసి క్రింద పడేశాడు చెబ్బీ. మందపాటి చెప్పులున్నాయి అతని పాదాలకు. వాటితో ఆ బీడీని నలిపేశాడు.

"ఇంకా చాలారోజులున్నాయి నాకు. ఇప్పుడిప్పుడే మూడిపోవటానికి ఛాన్సు లేదుగాని... ఒక చిన్న ఇన్ఫర్మేషను కావాలి..." అన్నాడు ఆ పౌరుడి వంక చూస్తూ. ఒంటికి సరిపడని పదార్థం ఏదో నోటిలో పెట్టుకున్నట్టు వెగటుగా తయారయింది ఆ పౌరుడి ముఖం.

"నీతో అచ్చిక బుచ్చికలు ఆడానని తెలిస్తే నీకంటే ముందుగా నా మక్కెలు విరిగిపోతాయి. అడిగేది ఏదో ఆ కానిస్టేబుల్‌నే అడుగు" గబగబా చెప్పాడు. చెప్పిన తర్వాత అక్కడే ఆగలేదు.

అర్జంట్ పని ఏదో అప్పుడే గుర్తుకువచ్చినట్లు హడావుడిగా వెళ్ళిపోయాడు అవతలికి. బలమైన దెబ్బ తగిలి, చచ్చుబడినట్లు వేలాడబడిపోయింది కానిస్టేబుల్ చేయి. చెబ్బీ నెట్టిన తర్వాత నేలమీద చతికిలపడిపోయి వున్నాడు.

ముందుకు వంగి అతని భుజంమీద చేయివేశాడు చెబ్బీ. "చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి మేరా దోస్త్..." అని అతన్ని రిక్వెస్ట్ చేయబోయాడు.

మాట అతని పెదవుల్ని దాటి బయటికి రాకముందే, గుమికూడిన పౌరుల్ని తన చేతిలోని లాఠీతో చెదరగొడుతూ రానేవచ్చాడు యస్సయ్ సాబ్.

"ఎవరు? ఎవఁ్రా మా కానిస్టేబుల్ మీద చెయ్యి వేసింది? ఎవడా దుష్మన్?" అంటూ వెనుకా ముందు చూసుకోకుండా, ముందుగా వంగి వున్న చెబ్బీ వెన్నుమీద ఫెడీమని కొట్టాడు లాఠీతో.

గొంతు చినిగిపోయేటట్టు ఆర్తనాదం చేసి, అలాగే ముందుకు పడిపోవాలి చెబ్బీ- అతని అంచనా ప్రకారం. పడిపోయిన తర్వాత నీళ్ళల్లో నుంచి బయటికి తీయబడిన చేపమాదిరి గిలగిలలాడిపోవాలి.

అటువంటి పనులు ఏవీ జరగలేదు. తోకమీద దెబ్బపడిన తాచుపాము మాదిరి చివ్వున పైకి లేచాడు చెబ్బీ.

"ఎవరని అనుకుంటున్నావ్ బే నన్ను? ఏం జరిగిందో తెలుసుకోకుండా మీదికి ఎగబడితే చూస్తూ ఊరుకునే చచ్చుముఖాన్ని అనుకుంటున్నావా?" అంటూ తన చేతుల్లోనే వున్న బాణాకఱ్ఱను బలంగా ముందుకు జాచి అతని పాదాల మధ్యకు నెట్టాడు.

బ్యాలెన్స్ నిలబెట్టుకోవటం అసాధ్యమైపోయింది యస్సయ్ సాబ్‌కి. ఎంత ప్రయత్నించినా నిలబడివుండటం అసాధ్యమైపోయి, కానిస్టేబుల్ మాదిరి చతికిలబడిపోయాడు నేలమీద.

"ఏం మనుషుల్రా మీరు... సరైన దెబ్బ పడకముందే గావుకేకలు... చతికిలబడిపోవటాలు... షిన్‌షిరా సిటీ పోలీసులంటే నిప్పుముద్దలని చెపితే ఏమో అనుకుంటూ వచ్చాను.

వట్టి కట్టుకథలని తేలిపోయింది" అంటూ నోళ్ళు తెరుచుకుచూస్తూన్న గుంపుకేసి తిరిగాడు చెబ్బీ.

"అయ్యలూ... మీలో ఎవరయినా దయచేసి చెప్పండి... నేను-" అని మొదలుపెట్టాడు.

పూర్తికాలేదు మాట. తమ ఎదుట ఎవరో బ్రహ్మరాక్షసుడు నిలబడి వున్నట్లు చెదిరిపోయారు అందరూ. ఒకటి నుంచి నాలుగు అంకెలు లెక్కబెట్టే లోపల కలికానికి కూడా కనిపించకుండా దూరంగా వెళ్ళిపోయారు.

"అరెస్టు చేయండి... ఈ బద్మాష్ కాళ్ళు చేతులకు సంకెళ్ళు తగిలించి స్టేషన్‌కి తరలించండి... కమాన్... కమాన్" కిందినించి లేవకుండానే పెద్ద కంఠంతో అరిచాడు యస్సయ్ సాబ్.

అప్పటివరకూ ఎక్కడ వున్నారో తెలియదు కాని, తమ బూట్ల శబ్దంతో ఆ ఏరియాని  అల్లకల్లోలం చేస్తూ వచ్చేశారు పదిమంది పోలీసులు.

నాలుగు అడుగుల పొడవున్న తమ లాటీలతో విరుచుకుపడిపోయారు. బాణాకర్రను బిగించి పట్టుకుని, తను కూడా రెచ్చిపోదామని అనుకున్నాడు చెబ్బీ. నవ్వులాటగా మొదలైన ఆ గొడవ చాలా సీరియస్ టర్న్ తీసుకున్నదని అర్థం అవటంవల్ల ఆగిపోయాడు.

"అనవసరంగా శ్రమపడకండి. పారిపోయే ప్రయత్నం చేయను. మిమ్మల్ని ఎదిరించే పనికూడా పెట్టుకోను. చిన్న ఇన్ఫర్మేషన్ కోసం వచ్చాను.

సమాధానం చెపితే, మీరు ఆగమన్నా ఇక్కడ ఆగను... దయచేసి నాకు సమాధానం ఇవ్వండి." ఒంటిమీద పడుతున్న లాటీలను పట్టించుకోకుండా,

ముఖం మీదికి వస్తున్నవాటిని మాత్రం అడ్డుకుంటూ మహా మర్యాదగా వేడుకున్నాడు.

వినిపించుకోలేదు ఎవరూ, పిచ్చిగా కొట్టేశారు. మీదపడి నేలకు దొర్లించారు... చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నారు. "నీ పని అయిపోయింది. కండలు కండలు ఊడి వచ్చేటట్లు లాకప్‌లో పడేసి విరగకొట్టకపోతే నా పేరు మార్చుకుంటానని" అతను తమకు దొరికిపోయాడని నమ్మకం చిక్కిన తర్వాత, కిందినించి లేస్తూ రంకెలు పెట్టాడు యస్సయ్ సాబ్.

"సాబ్... యస్సయ్ సాబ్... నా చెయ్యి పనిచెయ్యటంలేదు. నా చేతిని వాడు విరిచేశాడు" తను కూడా లేచి నిలబడుతూ జాలిగొలిపే కంఠంతో చెప్పుకున్నాడు మొట్టమొదటగా దెబ్బతిన్న ట్రాఫిక్ కానిస్టేబుల్.

"స్టేషన్‌కి వచ్చి కంప్లయింట్ రాసివ్వు. సాక్ష్యాలు వుంటే వాటిని కూడా తీసుకురా... సాయంత్రం వరకూ నీకు డ్యూటీ వుంది. ముందు అది పూర్తిచేయి" గంభీరంగా చెప్పాడు యస్సయ్ సాబ్.

"వట్టి అహంభావిమాదిరిగా కనిపిస్తున్న ఆ పోలీస్ అధికారిలో అంతకుముందువరకూ కనిపించని ఇంకో పర్సనాలిటీ కనిపించింది చెబ్బీకి.

తనను పట్టుకున్నవారిని విదిలించికొట్టి, తన దారిన తను వెళ్ళిపోవాలని అనుకుంటున్నాడు అతను. ఆ కోరికను వెంటనే అదిమేసుకున్నాడు.

"ఏది నా వెహికిల్ ఎక్కడ?" అడిగాడు యస్సయ్ సాబ్.

బర్రుమని మోతలు చేస్తూ వచ్చి నిలబడింది ఒక పోలీసువాహనం. శిలా విగ్రహం మాదిరి నిలబడివున్న చెబ్బీని నెట్టుకుంటూ తీసుకుపోయి అందులో కూర్చోబెట్టారు పోలీసులు.

పావుగంట తర్వాత స్టేషన్ ముందు ఆపి, మరోసారి నెట్టుకుంటూ లోపలికి తీసుకుపోయారు అతన్ని.

స్వయంగా దగ్గరవుండి లాకప్ తలుపులు తెరిపించి, మెడమీద చెయ్యివేసి లోపలికి తోశాడు యస్సయ్ సాబ్.

"సరైన సమయంలో వచ్చి వాడిని కమ్ముకున్నారు మీరందరూ... చాలా సంతోషంగా వుంది. బయటికిపోయి చాయ్ తాగిరండి... నాకు కూడా తీసుకురండి..." లాకప్ గది వెలుపల నిలబడిన వారందరికీ చెప్పాడు.

సంతోషంగా తలలు ఊపి వెనుతిరగబోతుండగా

"వాడికి కూడా రెండు కప్పులు తీసుకురండి... రెండు రొట్టెలు కూడా" అని చెప్పాడు.

లాకప్ చివరిభాగంలో వున్న ఒక సిమెంట్ దిమ్మ దగ్గరికిపోయి, తీరికగా కూర్చోవాలని అనుకుంటున్న చెబ్బీకి, వెంటనే కలిగింది విపరీతమైన ఆశ్చర్యం. "ఒకేసారి రెండు చాయ్‌లు తాగుతానని ఎలా తెలుసు?" ఆశ్చర్యాన్నయినా, కోపాన్నయినా ఎంతోసేపు దాచుకోవటం అలవాటులేకపోవటంవల్ల సూటిగా అడిగేశాడు.

"చాయ్‌లు తాగటం ఒక్కటే కాదు. ఈత చెట్టుకు వేలాడదీసిన కుండలు కనిపించినా నీకు ఆత్రం ఆగదు. రెండు కుండల్ని ఖాళీ చేస్తేగాని నీ దాహం తీరదు" లాకప్ లోపలికి వచ్చి, ఒక గోడను ఆనుకుని నిలబడుతూ మృదుస్వరంతో అన్నాడు యస్సయ్ సాబ్.

తన తల గిర్రున తిరుగుతున్న అనుభూతి కలిగింది చెబ్బీకి.

ట్రాఫిక్ కానిస్టేబుల్ మాటలకు సమాధానం ఇస్తున్న సమయంలో తనకు కనపడీ కనపడనట్లు గోచరించిన రెండో పర్సనాలిటీ ఇప్పుడు చాలా స్పష్టంగా తన ఎదుట ప్రత్యక్షం అవటం విచిత్రంగానే తోచింది అతనికి.

"అయ్యా... నేను అధికంగా మాట్లాడినట్లు ఏదైనా మీకు అనిపించివుంటే దయచేసి నన్ను క్షమించండి.

మీరు ఎవరో చెప్పండి" అంటూ వినయంగా అడిగాడు.

"నా గురించి చెప్పటానికి ఏమీ లేదుగాని, నీ గురించి చెపితే వినటానికి సిద్ధంగా వున్నాను" చిరునవ్వుతో అన్నాడు యస్సయ్ సాబ్.

మరింత అయోమయానికి గురైనాడు చెబ్బీ. "నా గురించి చెప్పలేను... నాకు ఒక ఇన్ఫర్మేషన్–" అంటూ మొదలుపెట్టబోతుండగా– చేతిని ఎత్తి ఆపేశాడు యస్సయ్ సాబ్.

"బీహార్ బందిపోటు ఠాకూర్ రాంచంద్‌కి ముఖ్యమైన బాడీగార్డువి నువ్వు. నీ పేరు చెబ్బీ... నీ బాసుకోసం స్పెషల్ బ్రాంచివాళ్ళు నా చిన్నతనం నుంచీ వెతుకుతూనే వున్నారు.

అతని బాడీగార్డువి నువ్వు ఈ పట్టణంలోకి వచ్చావని తెలిస్తే– ఆవురుమని సంతోషించి, ఆఘమేఘాలమీద వచ్చేస్తారు. నీ కాళ్ళు చేతుల్ని విరగగొట్టి తమ వెంట తీసుకుపోతారు" అన్నాడు.

లాల్చీ జేబులో వున్న తిరంగా బీడీ కట్టను బయటికి తీయబోయి, మధ్యలోనే ఆగిపోయాడు చెబ్బీ.

"పరవాలేదు... బీడీ కాల్చుకోవచ్చు" పర్మిషన్ ఇచ్చాడు యస్సయ్ సాబ్. బీడీని వెలిగించుకుని, పొగను గుండెలనిండా పీల్చుకుంటూ తల ఊపాడు చెబ్బీ.

"ఎక్కడో వున్న బీహార్ నుంచి నువ్వు ఈ మారుమూలకి రావటం దేనికి?" అడిగాడు యస్సయ్ సాబ్.

"అదే సాబ్ నాకు కావల్సిన ఇన్ఫర్మేషను. అడిగిన వెంటనే సమాధానం ఇచ్చి వుంటే ఈపాటికి హాయిగా ఇంటికి వెళ్ళిపోతూ వుండేవాడిని...." అన్నాడు చెబ్బీ.

గోడను ఆనుకుని నిలబడి వున్న యస్సయ్ సాబ్ అందుకు ఏదో ఒక సమాధానం ఇవ్వకముందే, పరుగు పరుగున లాకప్ దగ్గరికి వచ్చేశాడు స్టేషన్ వెలుపల సెంట్రీ డ్యూటీ చేసే ఇంకో కానిస్టేబుల్.

సడన్‌గా మారిపోయాయి యస్సయ్ సాబ్ ముఖ కవళికలు. సాఫ్ట్‌గా వున్న చూపులు కరుకుగా మారాయి. ఠక్కున అటెన్షన్‌లో నిలబడి స్మార్ట్‌గా శాల్యూట్ చేశాడు ఆ కానిస్టేబుల్.

"పది క్వాలిస్ కార్ల కాన్వాయ్ వస్తోంది సాబ్... మన దగ్గరికే అనిపిస్తోంది" ఏకబిగిన చెప్పి, ఎంత వేగంగా వచ్చాడో అంతే వేగంగా వెళ్ళిపోయాడు వెలుపలికి.

లాకప్‌లో నుంచి బయటపడి వచ్చే వ్యవధి యస్సయ్ సాబ్‌కి లభించలేదు. దుమ్ముతెరలు రేపుతూ స్టేషన్ ముందు ఆగిన కాన్వాయ్ మధ్య భాగంలో వున్న వెహికిల్ నుంచి దిగింది ఒక పొట్టి పర్సనాలిటీ.

పిచ్చిపిచ్చిగా ముఖంమీద పడుతున్న జుట్టును వెనక్కి విదిలించుకుంటూ వేగంగా స్టేషన్‌లోకి ఎంటర్ అయింది. తన చేతుల్లో వున్న గన్‌ని కిందికి వదిలేసి, తమ పైఅధికారులకు చేసినట్లు గబుక్కున శాల్యూట్ చేసిన సెంట్రీ వంక చాలా ఆదరంగా చూసింది.

"మీ పెదనాన్న మొన్న మూడురోజుల క్రితం మా కోఫ్గిల్ సిటీకి వచ్చి, నాకు జున్నుపాలు బహుమతిగా ఇచ్చాడు బే.... చాలా రుచిగా వున్నాయి. మెచ్చుకున్నానని చెప్పు" అన్నది.

తన ఛాతీ అప్పటికప్పుడు ఇంకో రెండు అంగుళాలు విస్తరించినట్లుగా పొంగిపోయాడు ఆ కానిస్టేబుల్.

"మీ యస్సయ్ సాబ్ ఎక్కడా?" అని అడుగుతూనే లోపలి గదుల్లోకి వచ్చింది ఆ పర్సనాలిటీ.

"లాకప్ గదుల దగ్గర వున్నారు" అని ఆ కానిస్టేబుల్ సమాధానం చెప్పక ముందే- గబగబా ఎదురుపోయాడు యస్సయ్ సాబ్. శాల్యూట్ చేయలేదు. వినయంగా నమస్కారం చేశాడు.

"మా చెబ్బీగాడు మీ వాళ్ళతో గొడవపడి ఇక్కడికి తీసుకురాబడ్డాడట" నడుము మీద చేతులు వేసుకుంటూ అన్నది ఆ పర్సనాలిటీ.

"అహ్హాయ్... గంగూ... ఇక్కడ వున్నా... నేను ఇక్కడ వున్నాను" లాకప్ నుంచి చెవులు చిల్లులుపడిపోయేటట్లు వినవచ్చింది చెబ్బీ కంఠం.

నవ్వులమయమైపోయింది ఆ పర్సనాలిటీ వదనం.

# 2

"నీకు ఒళ్ళు పెరిగింది తప్ప మెదడు పెరగలేదు బే... బస్‌స్టేషన్‌లో దిగీదిగగానే గట్టిగా ఒక కేకపెట్టి వున్నట్లయితే, క్షణాలమీద నాకు తెలిసిపోయి వుండేది...మొద్దు ముఖంగాడివి. అనవసరంగా తన్నులు తిన్నావు.

మూడే మూడు అంగల్లో లాకప్‌లోకి ఎంటరై, చెబ్బీని గాఢంగా కౌగలించుకుంటూ అన్నది ఆ పర్సనాలిటీ." అర్జంటుగా నీకు చెప్పాల్సిన విషయం ఒకటి వుంది" అతిప్రయత్నంమీద అతని చేతుల్లోనుంచి బైటపడుతూ అన్నాడు చెబ్బీ.

"ఎప్పుడూ లేనిది మూడు రోజులనుంచీ ఈ చుట్టుపట్ల కనిపిస్తున్నారు స్పెషల్‌బ్రాంచి మనుష్యులు. అదేమిటో తెలుసుకోవటానికే నేను వచ్చాను" చెబ్బీ చెయ్యి పట్టుకుని లాకప్‌లోనుంచి, ఎస్సై సాబ్ గదిలోకి నడిపిస్తూ చెప్పింది ఆ పర్సనాలిటీ.

ఎస్సైసాబ్ టేబుల్ ముందున్న కుర్చీలో చతికిలబడుతూ చుట్టూ చూశాడు చెబ్బీ–ముఖ్యంగా ఎస్సైసాబ్‌వైపే మూడుసార్లు.

"మనోడే... మనం ఏంచెబితే అది అక్షరాలా చేసిచూపించేవాడే. నువ్వు తటపటాయించవలసిన పనేమీ లేదు" అక్కడే నిలబడిన ఎస్సై భుజంమీద ఒక చరుపు చరుస్తూ చెప్పింది ఆ పర్సనాలిటీ. నవ్వుతూ నవ్వుతూ ప్రేమపూర్వకంగా చరిచిన చరుపు అది. బండరాయి ఏదో వచ్చి భుజంమీద పడినట్లు ముందుకు వంగిపోయాడు అతను.

ఆటో దిగీ దిగగానే ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో జరిగిన గొడవ వెంటనే కనులముందు మెదిలింది చెబ్బీకి. లాఠీని పట్టుకుని పిశాచంమాదిరి వచ్చేశాడు ఆ ఎస్సై...ఎందుకు ఏమిటి అనే ప్రశ్నలు వేయకుండా ఎకాఎకిన ఉతుకుడు మొదలుపెట్టేశాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Target+Shadow**

* * *